సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం : 30 : అక్టోబర్ : 2024



ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

జీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ మంగళవారంతో ముగిసింది. విద్యార్థులు పలు ప్రాజెక్టులు, యంత్ర పరికరాలను ప్రదర్శించారు. 8లో ▸



దడ పుట్టిస్తున్న ధరలు

మార్కెట్‌లో కూరగాయల ధరలు సామాన్యుడికి దడ పుట్టిస్తున్నాయి. ఏ కూరగాయ ధర చూసినా కిలో దాదాపు రూ.50 పైగానే ఉండడంలో ఏం కొనేలా లేవు. 8లో ▸



వార్డు సభ్యురాలిపై దాడి

పూళ్ల శివారు సాయన్నపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యురాలిపై ఓ వర్గానికి చెందిన నలుగురు దాడి చేశారు. ఆమెకు భీమడోలు ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

కౌశల్ 2024 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కౌశల్–2024 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల పోస్టర్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను భారతీయ విజ్ఞాన మండలి ప్రతినిధి స్వర్ణ వెంకటేశ్వర రావు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి క్విజ్‌కు తరగతికి ముగ్గురు చొప్పున 9 మంది, పోస్టరు, రీల్స్‌కు తరగతికి ఇద్దరు చొప్పున ఆరుగురు విద్యార్థులు మొత్తం ఒక్కొక్క పాఠశాల నుంచి 15 మంది పోటీల్లో పాల్గొనడానికి అవకాశం ఉందన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు రూ.1500, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.1000, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున అందజేస్తారన్నారు.

ఉచిత సిలిండర్ పథకం అమలుపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీపై సంబంధిత అధికారులు, జిల్లాలోని గ్యాస్ పంపిణీదారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్పీజీ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు ఉండి ఆధార్, బ్యాంక్ అకౌంటు వివరాలు గ్యాస్ కనెక్షన్ వివరాలతో అనుసంధానమై ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 31, 2024 నుంచి 31 మార్చి 2025 మధ్య కాలంలో ఒక సిలిండర్ ఇస్తారన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ ఒకటి 2025 నుంచి 31 జూలై 2025 మధ్య మొదటి సిలిండర్, ఆగస్టు ఒకటి 2025 నుంచి 31 నవంబరు 2025 మధ్య రెండో సిలిండర్, డిసెంబర్ ఒకటి 2025 నుండి 31 మార్చి 2026 మధ్యలో మూడో సిలిండర్ లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తారని ఆయన తెలిపారు.

సొసైటీలను బలోపేతం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో వివిధ రకాల సహకార సంఘాల ఏర్పాటులో అల్పాదాయ వర్గాలకు ప్రముఖ స్థానం కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశంలో జిల్లాలో సహకార సంఘాల ప్రమోషన్, అవసరమైన భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతం కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన కొత్త బహుళార్థ సాధక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాల స్థాపన ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేసే ప్రణాళిక అమలు చేయవచ్చన్నారు. జిల్లాలో 369 గ్రామ పంచాయతీల్లో 122 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వీటిలో 42 సొసైటీలు బహుళ సేవలందిస్తున్నాయన్నారు. ఇప్పటికే ఉన్న వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలోకి రాని గ్రామ పంచాయతీలలో కొత్త బహుళ ప్రయోజన పరపతి సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం టి.అనిల్ కాంత్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ హనుమంతరావు, మత్స్యశాఖ అధికారి ఆర్.వి.ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఇళ్లు పూర్తి చేయాలి

ఏలూరు(మెట్రో): పోలవరం ప్రాజెక్ట్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత నిర్మాణ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలకు జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.ధాత్రి రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి పెండింగ్ గ్రీవెన్స్‌లు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

కూటమిలో కుమ్ములాటలు

- టీడీపీ, జనసేన మధ్య పెరుగుతున్న అగాధం
- చింతలపూడిలో జనసేన పట్ల టీడీపీ వివక్ష
- చింతలపూడి టీడీపీ నేతల తీరుపై జనసేన ఇన్‌చార్జి బహిరంగ విమర్శలు
- దెందులూరులోనూ టీడీపీ, జనసేన మధ్య విమర్శల యుద్ధం
- డిప్యూటీ సీఎంను విమర్శించిన వారిపై చర్యల కోసం జనసేన డిమాండ్



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలో కూటమికి బీటలు వారుతున్నాయి. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో టీడీపీ నేతలను, జనసేన నేతలు బహిరంగంగా విమర్శించడం, దెందులూరులో జనసేన నేతలను టీడీపీ నేతలు బహిరంగంగా విమర్శించడం ఇలా ప్రతి నియోజకవర్గంలో ఏదోక కుమ్ములాట సర్వ సాధారణమైపోయింది. సవాళ్లు, ప్రతిసవాళ్లతో హడావుడి చేస్తూ సోషల్ మీడియాలో తారాస్థాయిలో మాటల యుద్ధానికి రెండు పార్టీల నేతలు తెరతీయడం చర్చనీయాంశంగా మారింది. నిన్న, మొన్నటి వరకు ఇసుక, మద్యం షాపుల పంచాయితీల్లో తర్జన భర్జనలు, మాటల యుద్ధం అంతర్గతంగా సాగినా తాజా పరిణామాలతో విభేదాలు రచ్చకెక్కాయి. తాజాగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించిన టీడీపీ నేతను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జనసేన నేతలు ధర్నా చేశారు.

ఏలూరు జిల్లాలో కూటమి రాజకీయం మారుతుంది. జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలకు 4 టీడీపీ, 3 జనసేన దక్కించుకున్నాయి. ఈ క్రమంలో 7 నియోజకవర్గాల్లో రెండు పార్టీల శ్రేణుల మధ్య అంతర్గత సర్దుబాట్ల విషయంలో తరచూ విభేదాలు తలెత్తుతున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే ఉన్న చోట జనసేనకు నామమాత్రంగా కూడా విలువ ఇవ్వడం లేదని, అలాగే జనసేన ఎమ్మెల్యే ఉన్నచోట టీడీపీ వాళ్లకు పనులు కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దెందులూరులో తారాస్థాయికి..

దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలకు ఎన్నికలకు ముందు నుంచే పొసగడం లేదు. టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి మధ్య విభేదాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో అనేక పర్యాయాలు ఇద్దరు నేతలు పరస్పరం విమర్శించుకున్నారు. చింతమనేని గెలిచిన తర్వాత జనసేన నేతలు పట్టించుకున్న పరిస్థితే లేదు. ఈ క్రమంలో చింతమనేని వ్యతిరేకించినా నేతలందరినీ జనసేనలో చేర్చుకోవడంతో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో కొల్లేరు టీడీపీ నేత శ్రీపర్రు సర్పంచ్ సోషల్ మీడియా వేదికగా కొల్లేరును పవన్‌కల్యాణ్ సర్వనాశనం చేస్తున్నాడని, జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి శ్రీపర్రు గ్రామంలో ఎలా అడుగు పెడుతుందో చూస్తామని తీవ్ర ఆగ్రహంతో మాట్లాడారు. సోషల్ మీడియాలో ఈ వీడియో పోస్టు చేయడం చర్చగా మారింది. దీనికి ప్రతిగా జనసేన నేతలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం ఇచ్చి శ్రీపర్రు సర్పంచ్ సైదు గోవర్ధన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆదివారం ఏలూరు నగరంలో జరిగిన వారాల పండుగ (గంగానమ్మ సంబరాలు)లో ఫ్లెక్సీ విషయంలో వివాదం చెలరేగి జనసేన కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు.

చింతలపూడి, పోలవరంలో టీడీపీ వర్సెస్ జనసేన

ఈ పరిణామాల క్రమంలో కూటమికి బీటలు పడేలా చింతలపూడి జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య బహిరంగ విమర్శలు చేయడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. కొద్ది రోజుల క్రితం పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో జనసేన నేతలతో జంగారెడ్డిగూడెంలో జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడీపీ తీరుపై విమర్శలు చేశారు. గత నాలుగు నెలలుగా నియోజకవర్గంలో నామమాత్రపు ప్రాధాన్యం ఇవ్వకుండా టీడీపీ నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ప్రారంభోత్సవాలు, ఇతర అభివృద్ధి పనులకు కనీసం ఆహ్వానం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు పొత్తులో భాగంగా చింతలపూడి అసెంబ్లీ టికెట్ టీడీపీకి కేటాయిస్తే చింతలపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ జనసేనకు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు టీడీపీ నేతకే చైర్మన్ పదవి కట్టబెట్టడానికి స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్, టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జనసేనను చిన్న చూపు చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం వాటా ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరికలు జారీ చేయడంతో చింతలపూడి రాజకీయం వేడెక్కింది.

సంగీత నృత్య సమ్మేళనంలో ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): అంతర్జాతీయ సంగీత నృత్య సమ్మేళనంలో ప్రథమ స్థానంలో నిలిచిన భీమవరం విద్యార్థులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ నెల 13న అంతర్జాతీయ నృత్య సంగీత సమ్మేళనం తెలంగాణ రాష్ట్రం చిక్కడపల్లి త్యాగరాజ గానసభలో నిర్వహించారు. ఈ పోటీలలో 9 జిల్లాల కళాకారులు పాల్గొనగా కూచిపూడి నృత్య విభాగంలో జిల్లా నుంచి భీమవరం కదలి భాను శ్రీ మాస్టారు ద్వారా శిక్షణ పొందిన విద్యార్థుల బృందం మూడు విన్యాసాల్లో ప్రథమ బహుమతులను గెలుచుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్‌ను విద్యార్థులు కలవగా అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు వివిధ అంశాల్లో కూడా ప్రవేశం, ప్రావీణ్యం సంపాదించి మెరుగ్గా రాణించాలన్నారు. 9 జిల్లాల కళాకారులు పోటీపడిన నృత్య ప్రదర్శనల్లో భీమవరం విద్యార్థులు ప్రథమ బహుమతులను గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ ఇచ్చిన భానుశ్రీని కూడా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధిలో నైపుణ్య గణన ప్రముఖ పాత్ర

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా అభివృద్ధిలో నైపుణ్య గణన ప్రముఖ పాత్ర పోషిస్తుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణన–2024 జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా వారు చేయాల్సిన విధులు, నైపుణ్యం యాప్‌పై మాస్టర్ ట్రైనర్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే యువత ఎక్కువగా ఉన్న దేశం భారతదేశమని.. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా దేశం తలసరి ఆదాయం పెరగడంతో పాటు, ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని ఆటోమేషన్, కృత్రిమ మేధ, ఆర్థిక వ్యవస్థ కీలకపాత్ర పోషించనున్నాయని, వాటి వల్ల కొత్త అవకాశాలతో పాటు సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. జిల్లా స్థాయి శిక్షణ తీసుకున్న వారు మండల స్థాయిలో, మున్సిపల్ స్థాయిలో మిగతా సచివాలయ సిబ్బందికి, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించాలని తెలియజేశారు. శిక్షణ అనంతరం సచివాలయ సిబ్బందికి క్లస్టర్ మ్యాపింగ్ చేసి, నవంబర్ మొదటివారం స్కిల్ సెన్సెస్ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.ఎస్.వేణుగోపాల్, నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి లోకమాన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలు షురూ





మూడు రోజుల పాటు బాణసంచా దుకాణాలకు అనుమతి ఇవ్వడంతో జిల్లాలో మంగళవారం నుంచి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాల వద్ద మొదటి రోజు అంత సందడి కనిపించలేదు. - భీమవరం

ఆగని వసూళ్ల పర్వం

మునునూరు మండలంలో కొనసాగుతున్న ఇసుక దందా



యల్లాపురంలో ఇసుక ట్రాక్టర్ల వద్ద నగదు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

ముసునూరు: మండలంలోని వలసపల్లి, యల్లాపురం గ్రామాల్లో ఇసుక రీచ్‌ల వద్ద అక్రమ వసూళ్ల పర్వం ఆగకపోగా ఇంకా కొనసాగుతూనే ఉంది. రీచ్‌ల ప్రారంభ సమయంలో మంత్రి పార్థసారథి చెప్పిన మాటలను పెడ చెవిన పెట్టి, ఇసుక ట్రాక్టర్ల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. యల్లాపురంలో స్థానికులు కాకుండా, పొరుగు ఊళ్ళ నుంచి వచ్చిన ప్రతి ట్రాక్టర్ యజమానుల నుంచి రూ.100 వరకు ప్రైవేట్ వ్యక్తిని ఏర్పాటు చేసి, దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రీచ్ లోపలకు వెళ్ళి ఇసుక లోడు చేసుకుని వచ్చేందుకు వీలుగా జేసీబీతో దారి వేయించామని, దీని ఖర్చుల నిమిత్తం అంటూ పంచాయతీ పేరు చెప్పి ప్రతి ట్రాక్టర్ ట్రక్కుకు రూ.100గా వసూలు చేస్తున్నట్లు ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. దీంతో ఉచిత ఇసుక పంపిణీ అందని ద్రాక్షగా మారి, అభాసు పాలైందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి కొందరు ఓనర్లు అధికార పార్టీ అండను, పరపతిని ఉపయోగించి, తనకున్న ట్రాక్టర్లన్నింటితో రీచ్‌ల నుంచి ఉచితంగా ఇసుకను సేకరించి, గృహావసరాలు కాకుండా, నూజివీడు, విసన్నపేట, హనుమాన్ జంక్షన్ పట్టణాలకు తరలించి రూ.5,000 నుంచి రూ.7,000 వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణం రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం రకరకాల పేర్లతో చేస్తున్న ఇసుక దోపిడీని నిలువరించి, పేదల గృహ నిర్మాణాలకు ఇసుక ఉచితంగా అందేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. అధిక వసూళ్ల విషయం తమ దృష్టికి రాలేదని, బుధవారం రీచ్‌లకు వెళ్లి విచారించి తక్షణ చర్యలు చేపడతామని తహసీల్దార్ పురుషోత్తమ శర్మ చెప్పారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంధన సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపవద్దని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులతో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం కరెడ్ల రామకృష్ణ అధ్యక్షతన వివిధ ప్రజా సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేస్తామని చెప్పారని, హామీకి భిన్నంగా మొత్తం రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం దారుణమైన చర్య అన్నారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెడతామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి గతం కంటే రేట్లు తగ్గించాల్సింది పోయి, విపరీతంగా పెంచారని, ఇసుకు అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ రంగంలోని అన్ని రంగాల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కొత్త మద్యం పాలసీ వల్ల మద్యం షాపుల సంఖ్య విపరీతంగా పెరిగాయన్నారు. సమావేశంలో సీహెచ్ బాబురావు, జేఎన్‌వీ గోపాలన్, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నేటికీ అన్యాయం

- పీఎఫ్, ఇతర అవకతవకలపై స్పందించని కాంట్రాక్టర్
- అయినా కాంట్రాక్టును కొనసాగిస్తున్న శ్రీవారి ఆలయ అధికారులు



శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం పారిశుద్ధ్య కాంట్రాక్టులో అవకతవకలు కారణంగా నష్టపోయిన కార్మికులకు నేటికీ న్యాయం జరగలేదు సంబంధిత కాంట్రాక్టరు నుంచి దేవస్థానం అధికారులకు ఇంతవరకు సమాధానం అందలేదు. అయినా ఆ కాంట్రాక్టును ఇంకా కొనసాగిస్తుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం 2022 అక్టోబర్ 1 నుంచి, 2024 సెప్టెంబర్ 30 వరకు పారిశుద్ధ్య పనులను సెవెన్‌హిల్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు అప్పగించింది. టెండర్ షరతుల ప్రకారం మినిమం 132 మంది సిబ్బందితో, 1,17,165 చదరపు మీటర్ల పరిధిలోని భవనాలు, ఓపెన్ ఏరియాల్లో పనులు జరిపించాలి. కార్మికులతో 3 షిఫ్టులుగా(ఒక్కో షిఫ్టు 8 గంటలు) పనులు చేయించాలి. నెలకు నాలుగు సెలవులు ఇవ్వాలి. కాంట్రాక్టరు ప్రతి నెలా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐలు కట్టాలి. అదనంగా పనిచేసిన సమయానికి ఓటీలు చెల్లించాలి. ఆ నిబంధనలేవీ ఇక్కడ అమలు కాలేదు. 50 మంది కార్మికులను తక్కువగా నియమించి, రెండు షిఫ్ట్‌ల్లో (ఒక్కో షిఫ్టు 12 గంటలు) పనులు చేయించారు. నెలకు నాలుగు సెలవులు ఇవ్వకపోగా, ఒక్కరోజు సెలవు పెట్టినా జీతంలో కోత విధించారు. 8 గంటలకు బదులు 12 గంటలు పనిచేసినా ఓటీలు ఇవ్వలేదు. అత్యంత దారుణంగా సగానికి సగం పీఎఫ్ సొమ్మును దిగమింగారు. పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ విభాగ అధికారులు చోద్యం చూస్తూ కూర్చున్నారు.

కాంట్రాక్టును కొనసాగించడంపై సందేహాలు

ప్రతి నెలా కాంట్రాక్టరుకు పూర్తి బిల్లును ముట్టజెప్పారు. మరో ఏడాది పాటు పారిశుద్ధ్య కాంట్రాక్టు కాల పరిమితిని పొడిగించేందుకు ప్రయత్నించారు. ఈ అవకతవకలపై సాక్షిలో ఇటీవల వరుస కథనాలు ప్రచురితమయ్యా యి. వీటిపై స్పందించిన ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి ఆదేశాలతో సంబంధిత అధికారులు సెవెన్‌హిల్స్ కాంట్రాక్టరుకు 15 రోజుల లోపు సమాధానం చెప్పాలని సుమారు నెల క్రితం నోటీసు జారీ చేశారు. ఇంత వరకు కాంట్రాక్టర్ సమాధానం ఇవ్వలేదు. ఈ ఏడాది జులైలో కార్మికుల ఖాతాల్లో జమకాని పీఎఫ్ సొమ్ము కొద్దిరోజుల క్రితం జమైంది. ఇదిలా ఉంటే ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెవెన్‌హిల్స్ పారిశుద్ధ్య కాంట్రాక్టు గడువు గత నెలాఖరుతో ముగిసినప్పటికీ.. అధికారులు కుంటిసాకులు చెబుతూ ఇంకా అదే కాంట్రాక్టును కొనసాగిస్తుండటం విడ్డూరంగా ఉంది. అలాగే దేవస్థానం అధికారులు ఇచ్చిన నోటీసుకు కాంట్రాక్టర్ సమాధానం ఇవ్వకపోవడం, అధికారులు దాన్ని పట్టించుకోకపోవడం హాస్యాస్పదంగా ఉంది. అయితే పారిశుద్ధ్య కార్మికులు తమకు న్యాయం చేయాలని ఆ చినవెంకన్నను వేడుకుంటున్నారు. దీనిపై ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి వివరణ ఇస్తూ పారిశుద్ధ్య కాంట్రాక్టరుకు తాము నోటీసు ఇచ్చామని, వారి నుంచి ఇంకా సమాధానం రాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నగరపాలక, పురపాలక పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, సమాన కేడర్ ఉన్న ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పదోన్నతులు కల్పించనున్నట్లు డీఈవో ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు.

దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు

- కూటమి ప్రభుత్వంలో రెండింతలు పెరుగుదల
- కార్తీక మాసంలో మరింత పెరుగుతాయని ఆందోళన
- అదుపు చేసే ప్రయత్నం చేయని ప్రభుత్వం



పత్తేబాద రైతు బజారులో కూరగాయల దుకాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సామాన్యుడికి కూరగాయల ధరలు అందనంత దూరంలో ఉన్నాయి. ఏ కూరగాయ ధర చూసినా కిలో దాదాపు రూ.50 పైమాటే గానీ అంతకన్నా తక్కువకు మార్కెట్‌లో దొరకడంలేదు. గత మార్చి నెలలో రూ.30 లోపు ఉన్న కూరగాయలు ఇప్పుడు రూ.50 నుంచి రూ.80 వరకూ ఉన్నాయి. సామాన్యుని బడ్జెట్‌లో సింహభాగం కూరగాయల ధరలకే వెచ్చించాల్సి రావడంతో వారి జీవనం భారంగా మారిపోతోంది. ప్రస్తుతం కూరగాయల ధరలు మాంసాహార ధరలతో పోటీపడుతున్నాయని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వేసవిలో నీరు అందుబాటులో లేక పంటలు పండక ధరలు పెరిగాయని సరిపెట్టుకున్న సామాన్య ప్రజలు.. వర్షాకాలం దాటినా వాటి ధరలు మరింత పెరుగుతుండడంతో ఏమి కొనాలో, ఏమి తినాలో పాలు పోక పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో పెరిగిన ధరలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ ప్రభుత్వం దళారులకు అండగా నిలుస్తుండడంతో పెత్తనమంతా వారిదే అవుతోంది. సోమవారం ఏలూరు రైతు బజారుల్లో గరిష్టంగా టమాటా రూ. 40, వంకాయలు రూ.76, బెండకాయలు రూ.52 పచ్చిమిర్చి రూ.48, కాకరకాయలు రూ. 54, బీర రూ.54 బంగాళదుంపలు రూ.40 , ఉల్లిపాయలు రూ.48 – 55, గోరుచిక్కుడు కాయలు రూ.50, దోసకాయలు రూ.48, ఆనబకాయ రూ.40 పొట్లకాయ రూ.40, కంద రూ.60, క్యాప్సికమ్ రూ.96, ఆకు కూరల కట్ట రూ.15 ఉన్నాయి. కొందరు రైతుబజారు వ్యాపారులు పట్టికలో ఉన్న ధరలకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడు. బహిరంగ మార్కెట్‌లో వీటి ధరలు కిలోకు మరో రూ.10 అదనంగా ఉంటున్నాయి.

కార్తీక మాసంలో కూరగాయలకు యమ డిమాండ్

కార్తీక మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ మాసంలో 50 శాతం మంది ప్రజలు ఇంటిలో మాంసాహార కూరలు వండనే వండరు. ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారాలు, కార్తీక ఏకాదశి, కార్తీక పౌర్ణమి వంటి పూజలతో పాటు చాలా మంది ఇళ్లల్లో కార్తీక నోములు నోచుకుంటూ ఉంటారు. అలాగే చాలా మంది భక్తులు అయ్యప్ప, శ్రీవేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి మాలలు ధరించి దీక్షతో వ్రతాలు ఆచరిస్తూ ఉంటారు. వీరు తమ బంధుమిత్రులకు అన్న సమారాధన నిర్వహిస్తూ ఉంటారు. దీంతో కార్తీక మాసంలో కూరగాయలకు డిమాండు ఎక్కువగా ఉంటుంది. ఈ డిమాండ్ మేరకు ప్రతి ఏటా కూరగాయల ధరలు పెరగడం సహజం. అయితే సాధారణ రోజుల్లోనే కొనలేని పరిస్థితిలో ఉంటే కార్తీక మాసంలో వీటి ధరలు ఏ స్థాయిలో పెరుగుతాయో అనే ఆందోళన సామాన్య ప్రజల్లో వ్యక్తమౌతోంది.

అదుపు చేయని ప్రభుత్వం

కూరగాయల ధరలు రెండింతలు పెరిగినా నియంత్రించేందుకు ఏ ఒక్క అధికారి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇటీవలి కాలంలో నిత్యావసర వస్తువులు, వంట నూనెల ధరలు పెరగడంతో వాటిని రైతు బజార్లతో పాటు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకు అందించే ఏర్పాటు చేశారు. అయితే కూరగాయల కోసం అటువంటి ప్రత్యేక కౌంటర్లేవీ ఏర్పాటు చేయలేదు. ప్రజలు నిత్యం వినియోగించే కూరగాయల ధరలను అదుపుచేయకుండా ప్రభుత్వం దళారులకు అండగా ఉంటోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

VEGETABLE RATES IN RYTHUBAZAR ELURU 28-10-2024

sno	Name of the item	Rythubazar Rate
1	టమాటో	36,40
2	వంకాయలు Gulabi	76
	వంకాయలు Kanthu	discolu 40,76
	వంకాయలు White	58
3	బెండకాయలు	52
4	పచ్చిమిరపకాయలు	40,48 whites
5	కాకరకాయలు	46,54 star
6	బీరకాయలు	36,54
7	కాలీఫ్లవర్	0
8	క్యాబేజి	32,36
9	క్యారెట్	50,60
10	దొండకాయలు	36,40 Local
11	బంగాళాదుంపలు	40
12	ఉల్లిపాయలు	40,48 new ,55 old
13	గోరుచిక్కుడు	50
14	దోసకాయలు	40,48
15	ఆనపకాయలు	30,40
16	పొట్లకాయలు	20,25
17	అరటికాయలు	7,10
18	చిక్కుడుకాయలు	
19	చామదుంపలు	48
20	మునక్కాయలు	7,10
21	కంద	60
22	బీట్రూట్	40,50
23	కీరాదోస	36
24	ఫ్రెంచ్‌బీన్స్	
25	Capsicum	84,96

ఏలూరు పత్తేబాద రైతు బజారులో కూరగాయల ధరల పట్టిక

కూరలు కొనాలంటేనే భయమేస్తోంది



ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పప్పులు, నూనెలు కొనలేకపోతున్నాం. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. కూరగాయలు కొనాలంటే ఆలోచించాల్సి వస్తోంది. కార్తీక మాసంలో కూరల ధరలు మరింత పెరుగుతాయని భయం వేస్తోంది.

– కె.రత్నకుమారి, గృహిణి

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ఈ ప్రభుత్వం వచ్చాక కూరగాయల ధరలు రెట్టింపునకు పైగా పెరిగాయి. రూ.20 ఉండే టమాటా రూ.40, రూ.30 ఉండే ఉల్లిపాయలు రూ.55కు పెరిగాయి. ఇలా ధరలు పెరిగిపోతే ఇంక కూరలు ఎలా తింటాం. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తిర్రి ఝాన్సీ, గృహిణి

క్లుప్తంగా

తాళపత్ర గ్రంథం మొక్క బహూకరణ



పారిజాతగిరి ఆలయంలో తాళపత్ర గ్రంథం మొక్కను నాటుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి తాళపత్ర గ్రంథం మొక్కను బీజేపీ నేత అర్జుల మురళి బహూకరించారు. ఈ సందర్భంగా మురళీ చెట్టు విశిష్టతను వివరించారు. తాళపత్రాలు ఇచ్చే తాటి చెట్టు 100 సంవత్సరాలు వరకు నిలిచి ఉంటుందన్నారు. ఎలాంటి పుష్పాలు, ఫలాలు ఇవ్వదన్నారు. తాళపత్రాల గ్రంథాలు ఈ తాటి చెట్టు ఆకుల నుంచే తయారు చేస్తారని తెలిపారు. ఈ మొక్కను రంపచోడవరం పందిరిమామిడి గ్రామంలో ఉన్న తాటిచెట్టు పరిశోధన కేంద్రం వారు శ్రీలంక నుంచి విత్తనాలు తీసుకువచ్చి అభివృద్ధి చేశారని, ఈ మొక్కను వారు దేవాలయానికి అందజేయగా తాము ఆలయ ఈవోకు అందజేసినట్లు చెప్పారు.

2న టెన్నికాయిట్ జట్ల ఎంపికలు

వీరవాసరం: నవంబర్ 2న స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పి మల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14, అండర్ 17 బాలబాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపికలు దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు 97013 65522 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో జిమ్, షటిల్ కోర్ట్



ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిన సింథటిక్ షటిల్ కోర్టు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో జిమ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఎంతో కాలంగా తమకు జిమ్ ఏర్పాటు చేయాలని అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో జిమ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి మంగళవారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. ఎంపిక చేసిన విద్యార్థులకు జిమ్ ట్రైనర్స్‌గా శిక్షణనిచ్చి, వారితోనే విద్యార్థులకు శిక్షణనివ్వనున్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరు సమయాల్లో జిమ్‌ను కేటాయించారు. అలాగే సింథటిక్ షటిల్ కోర్టును సైతం అందుబాటులోకి తెచ్చారు.

సారా, బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు



భీమడోలులో సారా తయారీదారులను అరెస్ట్ చేసిన అధికారులు

భీమడోలు, ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల, భీమడోలు మండలాల్లోని సారా తయారీ, బెల్ట్ షాపులపై మంగళవారం భీమడోలు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం గ్రామంలోని సీతారా ముడుగుంట వద్ద మటపర్తి అన్నవరం, మటపర్తి రామాంజనేయులును అదుపులోకి తీసుకుని, సారా తయారీకి అవసరమైన 800 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా భీమడోలు సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మొత్తం ఐదుగురిని కోర్టులో హాజరుపర్చారు. ఈ దాడుల్లో భీమడోలు సీఐ బి.సత్యనారాయణ నేతృత్వంలోని ఈఎస్‌టీఎఫ్ ఎస్సై కేఎండీ ఆరిఫ్ పాల్గొన్నాయి.

అటవీ అధికారులు బెదిరింపులను ఆపాలి

పోలవరం రూరల్: తెల్లవరం నిర్వాసితులపై అటవీ అధికారులు బెదిరింపులను ఆపాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజా రామారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీ గిరిజన సంఘానికి చెందిన తెల్లవరం నిర్వాసితులకు భూమికి– భూమి, కొండపోళ్లకు నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలను ఇంతవరకు ఇవ్వలేదన్నారు. దీంతో బతుకుతెరువు కష్టమై తెల్లవరం గ్రామంలో ఆవులు, మేకలను మేపుకుంటూ వ్యవసాయాన్ని చేసుకుంటున్న నిర్వాసితులపై గత నెల రోజుల నుంచి ఫారెస్ట్ అధికారులు బెదిరింపులకు పాల్పడ్డాన్ని ఏజెన్సీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భూమి, నష్టపరిహారం ఇవ్వకుండా గిరిజనులు గ్రామాలు ఎలా ఖాళీ చేయాలి, ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు.

ట్యాంకర్ నుంచి పెట్రోల్ చోరీ

దెందులూరు: ఆయిల్ ట్యాంకర్ నుంచి పెట్రోలు చోరీ చేసిన ఘటన దెందులూరు జాతీయరహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామంలోని పెట్రోల్ బంకుకు విజయవాడలో కొండపల్లి నుంచి ఏపీ 39వీడీ 6514 ఆయిల్ లారీ ట్యాంకర్ వెళుతుంది. మార్గమధ్యలో దెందులూరు జాతీయరహదారిపై వచ్చేసరికి లారీ క్లీనర్ డ్రైవర్లు అశోక్, బాలాజీ ట్యాంకర్‌ను నిలిపి రోడ్డు మీద 45 లీటర్లను చోరీ చేస్తుండగా అదే సమయానికి ఏలూరు నుంచి వస్తున్న దెందులూరు బంక్ యజమాని కొడాలి వాసు గమనించాడు. ఈ విషయంపై సంబంధిత బంకు యజమానికి, ఇండియన్ ఆయిల్ డీలర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా దెందులూరు బంకు యజమాని కొడాలి వాసు విలేకరులతో మాట్లాడుతూ తాము ఓటీపీ చెబితేగాని ఆయిల్ ట్యాంకర్ డోర్ ఓపెన్ కాదని, కానీ ఈ ట్యాంకర్ డోర్ ఎలా ఓపెన్ చేశారో అర్థం కావడం లేదన్నారు.

వైఎస్సార్ సీపీ వార్డు సభ్యురాలిపై దాడి

ర్యాంపు అక్రమణల తొలగింపులో వాగ్వివాదం



వార్డు సభ్యురాలి ఇంటి వద్ద ర్యాంపు తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ సీపీ వార్డు సభ్యురాలిపై టీడీపీ, జనసేనకు చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గాయపడిన ఆమెను భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలో సాయన్నపాలెంలోని 16వ వార్డు సభ్యురాలు కర్రి సరిత తన స్థలంలో నిర్మించుకున్న ర్యాంపును రాజకీయ కక్షతో ఆ ప్రాంత వాసులు మీకోసంలో తొలగించాలని 20 రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బంది అక్రమంగా ర్యాంపును తొలగించే పనులు చేపట్టారు. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరైన పద్ధతి కాదని గ్రామకార్యదర్శిని ప్రశ్నించారు. అయినప్పటికీ ర్యాంపును తొలగిస్తుండడంతో అడ్డు వెళ్లిన సరితను ఫిర్యాదు వర్గానికి చెందిన వ్యక్తులు గ్రామ కార్యదర్శి సమక్షంలోనే దుర్భాషలాడారు. అంతటితో ఆగక మహిళతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు సరితను నిర్దాక్షిణ్యంగా చితకబాది తీవ్రంగా గాయపర్చారు. ఆమెకు భీమడోలు సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థినుల ప్రాజెక్టును పరిశీలిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే వెంకటరాజు

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనల్లో గురుకులం విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు, యంత్ర పరికరాలను ప్రదర్శించారు. ప్రమాదాల నుంచి మనల్ని రక్షించే యంత్రాలను, నిత్యం వినియోగించే ఆటోమెటిక్ పరికరాలను, చెత్త నుంచి అందమైన బొమ్మలను తయారు చేసే విధానాన్ని ఇలా పలు రకాల ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో తూర్పు, పశ్చిమ, కృష్ణ, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 31 గురుకులాల్లోని 108 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా 52 మంది సీనియర్, జూనియర్ ఉపాధ్యాయులు, 63 మంది టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఈ సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుళ్ళవాయిలో తెలంగాణ మద్యం పట్టివేత

వేలేరుపాడు: వేలేరుపాడు మండల పరిధిలోని గుళ్ళవాయి గ్రామంలో పోలీసులు తెలంగాణ మద్యంను తరలిస్తుండగా పట్టుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సీఐ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు సారథ్యంలో ఎస్సై రామారావు ఆదేశాల మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డేనియల్, సిబ్బందితో కలిసి గుళ్ళవాయి గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన ఆకుల వెంకటేశ్వరరావు తన మోటార్ సైకిల్‌పై తెలంగాణ మద్యం 30 సీసాలు తీసుకువచ్చి ఇంటి వద్ద దించుతుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4,500 ఉంటుందని తెలిపారు.

బాణసంచా అక్రమ తయారీదారుల అరెస్ట్



కోరుకొల్లులో బాణసంచా అక్రమంగా తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఎస్సై

కలిదిండి (కైకలూరు): నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా తయారు చేస్తున్న ఇరువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కలిదిండి ఎస్సై వి.వేంకటేశ్వరరావు మంగళవారం కేసు నమోదు చేశారు. కోరుకొల్లు గ్రామంలో చెన్నంశెట్టి వెంకట సత్యనారాయణ, చలమలశెట్టి సతీష్ అక్రమంగా దీపావళి మందుగుండు సామాగ్రి తయారు చేస్తున్నారన్నారు. ఆకస్మిక తనిఖీ చేసి వారి నుంచి బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. అనుమతులు లేకుండా మందుగుండు సామాగ్రిని నిల్వ ఉంచినా, తయారు చేసినా నేరమని వివరించారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

అత్తిలి: విద్యుత్ షాక్‌తో ఓ కూలీ మృతి చెందాడు. ఎస్సై పి ప్రేమరాజు తెలిపిన వివరాల ప్రకారం ఆచంట మండలం కొడమంచిలి గ్రామానికి చెందిన గండికోట సాయిబాబా(28) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తిరుపతిపురం శివారు శివపురం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం వచ్చాడు. కాంక్రీట్‌తో వచ్చిన లారీ దిగుమతి చేస్తుండగా పైన విద్యుత్‌వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం తణుకు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

హత్యా నేరం కేసులో ఇద్దరి అరెస్ట్

నరసాపురం రూరల్: మద్యం మత్తులో ఒక వ్యక్తి హత్యకు పాల్పడిన ఇరువురిని సీఐ దుర్గాప్రసాద్ అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి.వాసు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. నరసాపురం మండలంలోని మోడి గ్రామానికి చెందిన మారెళ్ళ రాంబాబు (48) శనివారం రాత్రి ముత్యాలపల్లి గ్రామానికి వెళ్లాడు. అక్కడ మద్యం సేవించి తిరిగి వస్తుండగా మోడి సెంటర్‌లోని ఆ గ్రామానికి చెందిన జడ్డు నాయుడు, మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన ఉంగరాల వీరన్నల మధ్య వివాదం నెలకొంది. దీంతో ఆవేశానికి గురైన నాయుడు, వీరన్నలు రాంబాబును కొట్టడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. ఆదివారం రాంబాబు భార్య వెంకట కుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ దుర్గాప్రసాద్ మంగళవారం ఆయా గ్రామాల్లోని నిందితులను వారి ఇంటివద్దే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వాసు తెలిపారు.

క్లుప్తంగా

జగన్నాథపురంలో ఆయుర్వేద దినోత్సవం



జగన్నాథపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఆయుర్వేద దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ జరిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి మాట్లాడుతూ ఆయుర్వేదం భారతీయ చరిత్రలో పురాతనమైన వైద్యంగా నమోదు కాబడిన వైద్య విధానమన్నారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా వ్యాధుల నివారణకు ఆయుర్వేద వైద్యం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తులసి, గీత, అంజికుమారి, శాంతకుమారి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



తణుకులో రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

తణుకు: రోడ్డు భద్రత వారోత్సవాలు, పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు పురస్కరించుకుని మంగళవారం తణుకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తణుకు లయన్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీసు అధికారులతో పాటు సిబ్బంది రక్తదానం చేశారు. తణుకు పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణతోపాటు పలువురు పోలీసు కానిస్టేబుళ్లు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వీరిని తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, తణుకు పట్టణ సీఐ ఎస్.కొండయ్యలు అభినందించారు.

వైద్య శిబిరానికి 27 మంది హాజరు



తణుకులో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 27 మంది వైద్యసేవలు పొందారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలందించి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అత్తిలి రామన్నపేటలో అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి రామన్నపేటలో గల శ్రీఐశ్వర్యదుర్గ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం అఖండ అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నసమారాధనకు వేలాది మంది భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు..

అలంపురంలో భారీ కొండచిలువ హతం



అలంపురంలో హతమైన కొండచిలువ

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో మంగళవారం రాత్రి భారీ కొండచిలువను స్థానికులు గుర్తించారు. స్థానిక ఎస్సీ కాలనీ వద్ద గడ్డి వాములో ఉంటూ సమీపంలోని కోడి పిల్లలను నిత్యం తింటూ ఉండేదని స్థానికులు చెప్పారు. అయితే మంగళవారం రాత్రి బయటకు వచ్చిన కొండచిలువను చూసి స్థానికులు బెంబేలెత్తారు. ఆ ప్రాంతంలో మరికొంతమంది పోగై ప్రమాదమని గుర్తించి కొండచిలువను హతం చేశారు.

సర్వం సిద్ధం.. నిబంధనలకు విరుద్ధం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న పోలీసు, ఫైర్ అధికారులు

- పాఠశాల ఆవరణలోనే బాణసంచా దుకాణాల ఏర్పాటు
- వ్యాపారుల నుంచి రూ. 24 వేలు చొప్పున వసూళ్లు
- పాఠశాల అభివృద్ధి పేరుతో భారీ వసూళ్లు

తణుకు: పట్టణంలోని నడిబొడ్డున జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మరోసారి బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. మిత్రపక్షానికి చెందిన మాజీ వార్డు కౌన్సిలర్ ఒకరు వ్యాపారుల నుంచి రూ. 24 వేలు చొప్పున వసూలు చేసి ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. మొత్తం 32 దుకాణాలు ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారుల నుంచి అనుమతులుకోరుతూ దరఖాస్తులు చేసుకున్నారు. తాత్కాలిక లైసెన్సుల పేరుతో మూడు రోజుల పాటు బాణసంచా విక్రయించుకునేందుకు అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఇదిలా ఉంటే సంబంధిత అధికారులకు ముడుపులు చెల్లించుకోవాలని వ్యాపారులనుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. మరోవైపు తణుకు మండలం తేతలి-దువ్వ గ్రామాల మధ్య హైవే అనుకుని పెద్దఎత్తున రిటైల్ దుకాణాలు వెలిశాయి. తాత్కాలిక లైసెన్సులు పేరుతో 18 మందికి అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ నిబంధనలు పాటించకపోవడంతో అటు పోలీసు, ఇటు ఫైర్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నిబంధనలు ఏవీ..?

తణుకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలకు నిర్వాహకులు సరైన నిబంధనలు పాటించకపోవడంతో పోలీసు, ఫైర్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపుల మధ్య కనీసం మూడు అడుగుల మేర ఖాళీ వదలాలని, ఒక్కో షాపు వద్ద నీటి డ్రమ్ముతోపాటు ఇసుక, ఫైర్ ఎగ్జింస్టర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే షాపులకు మధ్య ఖాళీ వదలకపోగా మూడు షాపులకు కలిపి ఒక్కో ఫైర్ ఎగ్జింస్టర్ ఏర్పాటు చేయడం పట్ల తణుకు పట్టణ సీఐ కొండయ్య, ఫైర్ అధికారి అజయ్‌కుమార్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పాఠశాల ఆవరణ కాగా మరోవైపు పాఠశాల ఆనుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, చుట్టూ ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయని ఈ పరిస్థితుల్లో అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది.

వసూళ్లు ఏమవుతున్నాయి?

ప్రతి ఏటా బాణసంచా దుకాణ యజమానుల నుంచి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్న డబ్బులు ఏమవుతున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో వసూలు చేసిన మొత్తంతో పాఠశాల ఆర్చి నిర్మాణం చేపడుతున్నామని ప్రకటించారు. అయితే నిర్మాణ దశలోనే ఆర్చి కుప్పకూలిపోవడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. ఇదే సమయంలో తాను ఆర్చి నిర్మాణానికి విరాళం ఇచ్చినట్లు ఒక దాత ముందుకు రావడంతో వసూళ్ల వ్యవహారం అప్పట్లో వెలుగు చూసింది. ఈ ఏడాది సైతం వసూలు చేసిన డబ్బులు పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తామని చెబుతున్న నిర్వాహకులను ఎలా నమ్మాలంటూ వ్యాపారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు కింది స్థాయి నాయకులు తమ జేబుల్లో వేసుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో?

- చేపల చెరువు పక్కనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
- చెరువు గట్టు కోతకు గురవ్వడంతో ఆందోళన
- పాఠశాల భవనం కూలిపోతే ప్రమాదానికి ఎవరు బాధ్యులు?



వేల్పూరు గ్రామంలో మండల పరిషత్ నంబరు 4 ప్రాథమిక పాఠశాల



వేల్పూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో అధ్వానంగా ఉన్న ప్రైవేట్ వ్యక్తుల చేపల చెరువు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని ప్రైవేట్ వ్యక్తుల చేపల చెరువు గట్లు కోతకు గురికావడంతో ప్రభుత్వ పాఠశాల ప్రమాదం అంచున ఉంది. వేల్పూరు గ్రామంలో జనావాసాల మధ్య సుమారు 20 ఏళ్ల క్రితమే చెరువు తవ్వి చేపలను సాగు చేస్తున్నారు. మొదటిలో చెరువు చుట్టూ ఉన్న గట్లు క్రమంగా చెరువులో కలిసిపోవడంతో స్కూల్ గోడ వరకూ సుమారు 10 అడుగుల వరకూ గట్లు కోతకు గురయ్యాయి. వేల్పూరులోని లూథరన్ చర్చి వెనుక ఉన్న ఈ చెరువుకు తూర్పున నెంబరు 4 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎస్సీ కమ్యూనిటీ హాల్, స్కూల్ వంటశాల, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఉత్తరం వైపున పంచాయతీ రోడ్డు గత 8 సంవత్సరాలుగా కోతకు గురువుతుందని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకొనే నాదుడేలేడని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన 28 మంది విద్యార్థులు చదువుతుండగా వారికోసం ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఈ పాఠశాలను నాడు- నేడు కార్యక్రమంలో ఆధునీకరించి వసతులు కల్పించినా పాఠశాల వెనక భాగంలో ఉన్న ఈ చెరువు కారణంగా పాఠశాలలో ఫ్లోరింగ్ కుంగిపోతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ పాఠశాలకు ఒక వైపున చెరువు, మరో వైపు మురికి గుంట ఉండటంతో వాటిలోని ఈగలు దోమలు మధ్యనే తమ పిల్లలు విద్య నభ్యసించడంతో పాటు మధ్యాహ్నం భోజనం కూడా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా పాఠశాల పక్కనే కమ్యూనిటీ హాల్ నిర్మించినా చెరువు కారణంగా లోపల ఫ్లోరింగ్ కుంగిపోతుందని పేర్కొంటున్నారు. దీనితో పాటు ఎస్సీ ఏరియాకు విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఈ చెరువు గట్టు వద్దే ఏర్పాటు చేశారు. ఈ చెరువు గట్టు కోత కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న విద్యుత్ స్థంబాల వరకూ కోతకు గురికావడంతో భారీ వర్షాల సమయంలో మరమ్మతులు చేయాలంటే సిబ్బంది ఇబ్బందిగా మారి రోజుల తరబడి చీకటిలోనే మగ్గిపోతున్నామని ఏరియా వాసులు పేర్కొంటున్నారు.

అధ్వాన్నంగా చెరువు

వేల్పూరులోని ప్రైవేట్ వ్యక్తుల చేపల చెరువు ప్రస్తుతం గ్రామం మధ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, ఎస్సీ కమ్యూనిటీ హాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిలా మారిపోయింది. దీనితో పాములు వంటి విష క్రిమికీటకాలు ఉన్నాయనే భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ రోడ్డు కూడా కోతకు గురువుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ చెరువులో తూడు, నాచు పెరిగిపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేనతంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. చెరువును ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వలన ఈచెరువులోని తూడు, నాచు కారణంగా పాములతో పాటు దోమలు, ఈగలు పెరిగి స్థానికులకు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు ప్రమాదమే



వేల్పూరు గ్రామంలోని కోతకు గురౌతున్న ప్రైవేట్ వ్యక్తుల చేపల చెరువు కారణంగా ప్రభుత్వ పాఠశాలకు ప్రమాదకరం. గతంలో పాఠశాల ప్రహారీ గోడకు చెరువు గట్టు సుమారు 10 అడుగుల మేర ఉండేది. ప్రస్తుతం ఇప్పుడు పాఠశాల ప్రహారీ గోడ వరకూ చెరువు నీళ్లు వచ్చేశాయి. భారీ వర్షాలకు కురిసే సమయంలో ఎప్పుడైనా పాఠశాల కూలిపోయే ప్రమాదం ఉంది.

– మేకల భాస్కర్ ప్రసాద్, స్థానికుడు, వేల్పూరు

అధికారులు పట్టించుకోవడం లేదు



వేల్పూరు గ్రామంలోని ఎస్సీ ఏరియాలోని ప్రభుత్వ పాఠశాల ప్రహారీ గోడ వరకూ, పంచాయితీ రోడ్డు వరకూ చేపల చెరువు కోతకు గురువుతున్నాయని ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఈ చెరువు గట్టున పాఠశాలతో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఉన్నాయి. ఈవిషయంమై పాఠశాలను కాపాడాలని స్థానిక పంచాయతీ అధికారులకు పిర్యాదు చేశాం. ఈ సమస్యపై గతంలో పిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సోమవారం స్పందన కార్యక్రమంలో తహసిల్దార్‌కు పిర్యాదు చేశాం.

– కత్తుల జస్పాల్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు, వేల్పూరు

నోటీసులు ఇచ్చాం

వేల్పూరు గ్రామంలోని మధ్యలో వున్న చేపల చెరువు గత 20 సంవత్సరాల పూర్వం నుంచి వుంటుంది. యజమానులకు చాలా సార్లు నోటీసులు ఇచ్చాం. యజమాను లు గ్రామంలో నివాసం లేరు. వేరే చోట ఉంటున్నారు. ప్రైవేట్ వ్యక్తుల చెరువు కాబట్టి ఏమీ చేయలేం.

– ఎస్ రత్న మాలిక, గ్రామ కార్యదర్శి, వేల్పూరు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జేసీ, ఆర్డీవో

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనోతో కలసి దీనిని ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లో వారి ఖాతాకు సొమ్ములు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్య వచ్చినా ముందుగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 92 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎం శివ రామ్ జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలి

నరసాపురం: డీఎస్సీ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలని సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.బాలుసాధన సూచించారు. మంగళవారం స్థానిక వైఎన్ కళాశాలలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాలకు చెందిన సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలుసాధన మాట్లాడుతూ ఉచితంగా అందిస్తున్న డీఎస్సీ శిక్షణకు తక్కువ సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అవగాహన పెంచాలని చెప్పారు. సచివాలయ పరిపాలనా యంత్రాంగంలో ఎక్కడా లోపాలు లేకుండా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని చెప్పారు.

పరిశుభ్రమైన తాగునీరు అందరికీ అందజేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిశుభ్రమైన తాగునీరు అందరికి అందజేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం యర్ర నారాయణ స్వామి స్కూల్ వద్ద రెండు, మూడు వార్డుల ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకుగాను ఉచిత ప్యూరీఫైడ్ వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. అనంతరం దసరా ముగింపు కార్యక్రమాలలో భాగంగా స్థానిక వార్ఫ్ రోడ్డు, గణేష్ నగర్, మూడోవ వార్డులో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ

నరసాపురం రూరల్: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న కె.కుమార్ రవితేజ రెడ్డి జేఎన్‌టీయూకే బాస్కెట్‌బాల్ జట్టుకి ఎంపిక అయ్యాడు. సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన టీం విద్యార్థులను పలువురు అభినందించారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ఎ.గోపిచంద్ లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

తణుకు టౌన్: రెవెన్యూ సదస్సులతో రైతులు సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ తెలిపారు. మంగళవారం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలో భూ రీ సర్వేపై నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామంలో భూ రీ సర్వేకు సంబంధించి 36 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పీ గౌతమి, గ్రామ కార్యదర్శి పీ శ్రీనివాస్, వీఆర్‌వో అప్పన్న, వివిధ గ్రామాల సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెంటపాడు: మండలంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పెంటపాడు హెచ్‌సీ బాబూరావు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం చిలకంపాడుకు చెందిన పాట్నూరి చిన్నయ్య(45) పని నిమిత్తం ఈనెల 28న సాయంత్రం మోటార్‌సైకిల్‌పై పెంటపాడు మండలం ముదునూరు శివారు లాకుల ప్రాంతంలోని అరుందతీ పేట ప్రాంతంలోకి వచ్చేసరికి చిన్నయ్య వాహనం గూడెం- నుంచి భీమవరం వెళుతున్న మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో చిన్నయ్య తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు అతనిని రాజమండ్రి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మరో వాహన యజమాని సూర్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. చిన్నయ్య చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చిన్నయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బాబూరావు కేసు నమోదు చేసి ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి



విద్యుత్ చార్జీల పెంపుదల ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

తణుకు: ట్రూ అప్ పేరుతో ప్రజలపై వేసిన రూ. 6072 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తేతలి వై జంక్షన్ వద్ద విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి విద్యుత్ ఛార్జీల పెంపుదల ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే రూ. 6072 కోట్లు భారం ప్రజలపై వేయడం దారుణమన్నారు. ఎన్నికలలో చెప్పిన దానికి నేడు జరుగుతున్న పాలనకు చాలా తేడా ఉందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, కూరగాయలు, వంట నూనె ధరలు ఆకాశానంటుతున్నాయని అన్నారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీల భారంతో ములిగే నక్కపై తాటికాయ పడినట్లు ఉందన్నారు. పెంచిన ధరలు తగ్గించాలని లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, చిన్న, సూర్యారావు, కృష్ణ, రాంబాబు, శివ, అనిల్, అప్పన్న, రాము, అచ్యుత్, నర్సింహామూర్తి, రమేష్, సురేష్, సాయి, శ్రీను, శివసాయి, పెంటయ్య, రమణ,లక్ష్మణ్, బాలాజీ,తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్ పాతూరు ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మినగర్, జెడ్పీ ఫీడర్, పీఅండ్‌టీ కాలనీ ఫీడర్‌లకు సంబంధించి అత్యవసరంగా విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహామూర్తి వెల్లడించారు. టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, మహాలక్ష్మినగర్ రోడ్డు, గుణ్ణం ఫంక్షన్ హాల్ రోడ్డు, తాడేపల్లిచెరువు, పాతూరు, మసీద్ రోడ్డు, శేషమహల్ బ్యాంక్ సైడ్, డీఎస్ చెరువు, రాకెట్ పార్క్ ఏరియాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూ టౌన్ సౌత్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

టూ టౌన్‌లో విద్యుత్ లైన్‌లకు అడ్డంకిగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించే నిమిత్తం 33 కేవీ పెద తాడేపల్లి తాడేపల్లిగూడెం ఫీడర్, జువ్వలపాలెం, పెంటపాడు ఎస్ఎస్‌లకు సంబంధించి ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహామూర్తి వెల్లడించారు. జువ్వలపాలెం, మార్కెట్ ఏరియా, సవిత్రుపేట, నవ్వారుపేట, స్థానిక ఏలూరు రోడ్డు, భాగ్యలక్ష్మిపేట, సీతారాంపేట, రామచంద్రరావుపేట, తాళ్ళముదునూరుపాడు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి



బాణ సంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని చూస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: దీపావళి సందర్భంగా బాణ సంచాను విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించాలని మంగళవారం సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మొత్తం నియోజకవర్గంలో 21 మంది అనుమతులు ఇచ్చామన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మందికి, పెంటపాడు ఎస్టీవీఎస్ ఉన్నత పాఠశాలలో ఐదుగురికి, అలంపురం ప్రాంతంలో ముగ్గురికి, మండలంలో మరొకరికి అనుమతులు ఇచ్చారు. అన్ని రకాల మార్గదర్శకాలు పాటిస్తూ, బాణ సంచా విక్రయాలు చేసుకోవాలని అధికారులు చెప్పారు. నీరు, ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, ఫైర్ ఆఫీసర్ వెంకటరామారావులు దుకాణాలు ఏర్పాటుచేసే ప్రాంతాన్ని పరిశీలించారు. భీమవరం బైపాస్ రోడ్డులో హోల్‌సేల్ పండ్ల మార్కెట్ వీధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మందుగుండు సామాగ్రి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి లక్షా 20 వేల రూపాయల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

తాళ్లకోడు ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులోని జగనన్న పేదల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బీవీ వర్మ డిమాండ్‌చేశారు. తాళ్లకోడులోని 74 ఎకరాలల్లోని పేదల ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు లేవని, వర్షం వస్తే ముంపునకు గురవుతుందని, తాగడానికి మంచినీళ్లు లేవని, విద్యుత్ వీధి దీపాలు వెలగడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేదల ఇళ్ల కోసం సీపీఎం 25 ఏళ్ల పోరాట ఫలితంగా ఏర్పడిని కాలనీలో పేదలు సొంతంగా వెయ్యి మందికి పైగా ఇళ్లు నిర్మించుకున్నారని చెప్పారు. మరో వెయ్యిమంది ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 3500 మంది నివాసం ఉండే కాలనీలో కనీస వసతుల లేవని వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే పడవలపై వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ఈ ప్రాంతాన్ని ఆకివీడు నగర పంచాయతీలో అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. తాళ్లకోడులో వసతులకు కుప్పనపూడి గ్రామ పంచాయతీ తమ పరిధి కాదని చేతులు దులుపుకుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ స్పందించి తాళ్లకోడుకు ప్రత్యేక గ్రాంట్ విడుదల చేసి ప్రత్యేక అధికారి ద్వారా పర్యవేక్షించి పనులు చేపట్టాలిన కోరారు.

బ్లాక్ చైన్ టెక్నాలజీలో నిపుణుల కొరత

భీమవరం: దేశంలో బ్లాక్ చైన్ టెక్నాలజీలో నిపుణుల కొరత ఎక్కువగా ఉందని ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ (ఐడీఎస్) స్ట్రాటజీ పార్టనర్ షిప్ హెడ్ ఎడవల్లి సునీల్ సుబ్రహ్మణ్యం అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భారత్ బ్లాక్ చైన్ నెట్‌వర్క్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ సుబ్రహ్మణం మాట్లాడుతూ వైద్యం, ఆరోగ్యం, బ్యాంకింగ్, కార్పొరేట్ ఆర్థిక అంశాలపై స్పష్టత, రికార్డింగ్ తిరిగి పరిశీలన చేసే అంశాలు బ్లాక్‌చైన్ టెక్నాలజీలో ఉన్నాయన్నారు.